

# పెళ్ళిసందడి

ఆర్. సంధ్యాదేవి

పూర్ణచంద్ర కిరణాలతో వింత శోయగా లీనుతుంది. ప్రకృతి వెన్నెల తరంగాల వెల్లువలు భూమిమీదకు తెల్లగా ప్రవహిస్తున్నాయి. తన్మయుడై చూశాడు చోదకుడు.

వెన్నెల వెల్గుని చీల్చుకుంటూ కారు హెడ్‌లైట్లకాంతి విశాలంగా నిర్మానుష్యంగావున్న రోడ్డుపై అందంగా పరుచుకుంటూ ముందుకిసాగిపోతుంది కారు.

డ్రైవర్ చూపులు మాత్రం ఎదుటికే కేంద్రీకరింపబడి వున్నాయి. తల తిప్పి ఎటూ చూడలేదు. ఆ వేళప్పుడు జనసంచారంకూడా అట్టేలేదు. ఒకటి రెండు లారీలు మాత్రం వెళ్ళాయి ఆ దారిని. డ్రైవర్ టైముచూసుకున్నాడు. తొమ్మిది అయింది. ఆ టాక్సీ సామర్లకోట నుంచి కాకినాడ వెళ్తోంది

త్రోవలో ఒక టాక్సీ ఆగివుంది. పక్కన డ్రైవర్ నిలబడి చెయ్యూపుతున్నాడు టాక్సీ ఆపమని. పక్కనే ఇద్దరు అమ్మాయిలు నిలబడివున్నారు.

ఆ డ్రైవర్ తను ఎందుకు టాక్సీ ఆపాలన్నట్టుగా ముందుకిపోనిచ్చి మళ్ళీ అంతలోనే ఏదో ఆలోచించుకున్నాడు. పక్కన ఇద్దరు అమ్మాయిలు కూడా వున్నారు ఏమైందో ఏమిటో!

ముందుకిపోతున్నటాక్సీవైపు కోపంగా చూశారు యువతులు. ఎంతస్పీడుగా ముందుకి సాగిందో అంతేస్పీడుగాను రివర్సులోవచ్చి వాళ్ళముందు ఆగింది. టాక్సీడ్రైవర్ విసుగ్గా తల ఇవతలకు పెట్టి ఏమిటి అన్నట్టు చూశాడు.

ఆగివున్న టాక్సీడ్రైవర్ అతనికి విషయం వివరించి చెప్పాడు. కాకినాడ వెళ్తుంటే మధ్యతోవలో టాక్సీ పాడైంది వీళ్ళని ఆ టాక్సీలో తీసుకువెళ్ళమని చెప్పాడు.

"అవునండీ, ఇంత రాత్రివేళ ఇక్కడ ఎక్కడ వుంటాం" అంది ఓ యువతి ప్రాధేయపడుతున్నట్టుగా.

"డబ్బు ఎంతయినా సరే ఇచ్చేస్తాను. కాకినాడలో పెళ్ళివుంది మేము త్వరగా వెళ్ళాలి. ఏం తీసుకు వెళతావా!" అడిగింది మరోయువతి ఆజ్ఞాపిస్తున్నట్టుగా. ఆ మాట్లాడేతీరు ఆ అమ్మాయిలో కనిపిస్తున్న దర్పంచూస్తూనే అ డ్రైవర్ కళ్ళు చురుగ్గా ఆమెవైపు తిరిగాయి.

ఒక్కక్షణం ఆ చీకటిలో అతని కళ్ళు ఆమెను నఖశిఖపర్యంతం గమనించాయి. ఏం ఆలోచించుకున్నాడో ఏమో సరేనన్నాడు. ఆ యువతులు ఇద్దరూ సంతోషంగా సామాన్లతో పాటు టాక్సీలో కూర్చున్నారు.

టాక్సీ బయలుదేరింది. ఉన్నట్టు ఉండి టాక్సీలో లైటు వెల్గింది.

డ్రైవర్ ఒకసారి వెనక్కి చూశాడు. ఒక అమ్మాయి చామనచాయగా మామూలుగా వుంది. మరో అమ్మాయి తెల్లగా నాజూగ్గా బొమ్మలా కళ్ళు జిగేల్మనిపించేంత అందంగా వుంది. టాక్సీలో లైటు ఆరిపోయింది. అతను అలా తిరిగిచూడగానే ఇద్దరి అమ్మాయిల మనసుల్లో గుబుల్‌గుబుల్ మనసాగింది. రాత్రివేళ ప్రయాణం, ఈ డ్రైవర్ చూస్తే రౌడీలా వున్నాడు. ఇద్దరూ ఆడవాళ్ళు అని ఏ కత్తిఅయినా చూపి వస్తువులు పెట్లు

లాక్కుంటే ! ఆలోచించసాగారు.

మంజుల వైజాగ్‌లో ఎమ్.ఏ. చదువుతోంది. కాకినాడ స్వంతవూరు. చిన్న అన్నగారి పెళ్ళిఅని బయలుదేరి వచ్చింది. కూడా స్నేహితురాలిని తీసుకువచ్చింది. ఆ అమ్మాయివూరు సామర్లకోట. అక్కడదిగి బస్‌లో ఎందుకు టాక్సీలో వెళదామని టాక్సీ చేయించుకున్నారు. మధ్యలో డ్రైవర్ మరోసారి వెనకకు తిరిగిచూసి తల తిప్పేశాడు.

"హి సీమ్స్ టు బి ఎ రౌడీ" అంది మంజు.

"ఏమిటి అంటున్నారు!" వెంటనే తల తిప్పి చూశాడు.

చీకట్లో అతని కళ్ళు తళుక్కున మెరిశాయి.

"అ ఏమీలేదండి. మీ గురించి మాత్రం కాదు" అంది రమణి మెల్లగా.

"మీపేరు ఏమిటి" అంటూ ప్రశ్నించాడు. అతని దృష్టిమాత్రం ఎదుటికే కేంద్రీకరింపబడివుంది.

"నీకు అనవసరం" కటువుగా అంది మంజు. ఆమెకు అతని ప్రవర్తన చూస్తుంటే ఒళ్ళు మండిపోతుంది.

"ప్లీజ్ మంజూ! కీప్ క్వయిట్ టిల్ వుయ్ రీచ్ కాకినాడ" రమణి స్నేహితురాలి చెయ్యిపట్టుకొని బ్రతిమాలుతున్నట్టుగా అంది.

"ఐ కేర్ ఎ డామ్ వాట్ దిస్ ఫెలో విల్‌డూ" అంటూ నిర్లక్ష్యంగా తలయెగరేసి సీటుకి చేరబడింది మంజు.

"స్టాపిట్ మంజూ.ఇట్స్ ఆల్‌రైట్" అంది రమణి కాస్త కోపంగా.

"వై యు ఆర్ గెటింగ్ సో ఫ్రైటెండ్ వాట్ కెన్ హి డూ"మంజు నిర్లక్ష్యంగా అంది.

రమణి ఏదో జవాబు చెప్పేలోగా కారు కీమమని శబ్దంచేస్తూ ఆగిపోయింది.

మంజు సీటుకి వెనక్కి జారపడింది. అల్లా సడన్‌గా కారు ఆగగానే విటారుగా అయింది. రమణి అడిగింది అతన్ని ఏమైంది అంటూ.

"ప్చ్! మీరు కాస్త దిగి తొయ్యాలి" అన్నాడు అతను వెనక్కి తిరిగిచూస్తూ.

"మేము ఎందుకు తోస్తాం? మేము తొయ్యం" మొండిగా కోపంగా అంది మంజు.

"నాకేం తెల్లవార్లూ ఇలాగే వుంటానండి. మీరు ఏదో త్వరగా కాకినాడ చేరుకోవాలన్నారని" అన్నాడు అతను తాపీగా.

స్నేహితురాళ్ళు ఇద్దరూ ముఖ ముఖాలు చూసుకున్నారు.

రమణి మంజుచెయ్యిపట్టి నెమ్మదిగా లాగింది, అతనితో మనకి గొడవ ఎందుకన్నట్టు. ఇద్దరూ కారుడోర్ తెరుచుకుని దిగారు. చీరచెంగు నడుంకి బిగించుకుని శక్తిఅంతా కూడదీసుకుని కారు మెల్లగా తొయ్యసాగారు.

చీకటిలో అతనికళ్ళు మంజువైపు చూసి కొంటెగా నవ్వాయి. ఉన్నట్టుండి కారు స్టార్ట్‌అయి ముందుకి ఉరకటంతో బలంఅంతా అన్ని కారుని తోస్తున్న ఇద్దరు యువతులు తూలి ముందుకి పడబోయి అతికష్టంమీద పడిపోకుండా ఆపుకున్నారు.

అతను చేసినపనికి మంజుకి ఛర్రున కోపం వచ్చింది. అతన్ని ఏంచెయ్యలేక మనసులో కల్గిన కోపాన్ని ఒక్క గుటకలో మింగి వూరుకుంది. కొంచెం ముందుకిపోయి ఆగిన టాక్సీదగ్గరకు పరుగెత్తుకొని వెళ్ళారు ఇద్దరూ.

"ఇప్పుడు కూర్చోండి" అన్నాడు.

ఇద్దరూ కారులో కూర్చుని కారు డోర్ విసురుగా మూసి వాళ్ళకోపాన్ని చూపించారు. అతను అదేం పట్టించుకోలేదు. ఉషారుగా ఈలవేస్తూ కారు డ్రైవ్ చెయ్యసాగాడు.

మంజు మనసు కుతకుతలాడసాగింది.

కారు కాకినాడ చేరుకుంది. మంజు చెప్పిన అడ్రసుకి కారుపోనిచ్చి ఆ ఇంటిముందు ఆపాడు.

నౌకరు గబగబ వచ్చి సామాన్లు లోపలకు పట్టుకెళ్ళాడు.

"ఎంత అయింది!" మంజు కోపంగా అడిగింది.

"మీ దయ. అసలు నువ్వు ఇవ్వకపోయినా పర్వాలేదు" డ్రైవర్ కళ్ళు కొంటెగా నవ్వాయి.

సూటిగా తన కళ్ళల్లోకి గుచ్చి చూస్తున్న అతని చూపులకి కొద్దిగా కలవరపడింది మంజు.

మంజు హ్యాండ్‌బ్యాగ్ తెరిచి తన చేతికివచ్చిన డబ్బు ఆ డ్రైవర్‌చేతిలో పెట్టింది విసురుగా.

అతను ఆ డబ్బుతోపాటు ఆమె చేతిని పిడికిలితో మూశాడు.


"ఆడపిల్లకు అంత పొగరు పనికిరాదు" అంటూ చెయ్యి విడిచి పెట్టేశాడు. రెప్పపాటులో జరిగిన ఈ అనుకోని సంఘటనకు ఆమె బిత్తరపోయింది. ఒకడ్రైవర్ తనచేతిని పట్టుకుంటాడా! పళ్ళు పటపటలాడించింది. "ఊ! లోపలకు వెళ్ళండి" అంటూ కారు స్టార్ట్ చేశాడు. అతని పెదవులపై చిరునవ్వు నాట్యంచేసింది. కారు వెళ్ళిపోయింది. ఆమె ముఖం ఒక్కసారి జేవురించింది. రుసరుసలాడుతూ మనసులోకల్గిన కసిని, కోపాన్ని నడకలో ప్రదర్శిస్తూ లోపలకు వెళ్ళిపోయింది.

* * *

ఆరోజు రాత్రి పదకొండు గంటలకు మగపెళ్ళివారు బస్సు చేయించుకుని నాల్గు గంటలకు విడిదింటికి చేరుకున్నారు.

మంజుకి ఒకటే సరదాగా వుంది. ఆమె ఫ్రెండ్స్‌తో పెళ్ళికూతుర్ని చూడడానికి విడిదింటినుంచి ఆడపెళ్ళివారింటికి వెళ్ళింది.

తెల్ల ఫారిన్ నైలెక్స్ చీరపై జరీ కుట్టుపువ్వులున్న చీర, తెల్లజాకెట్




పొడవుచేతులది వేసుకుంది. పొడవుగా అల్లుకున్న రెండుజడలుతో అందంగా సుకుమారంగా వుంది మంజు.

మంజుని అందరూ ఎంతో మర్యాదగా చూశారు. కాఫీలు టిఫిన్లు ఇచ్చారు. కొత్తవాళ్ళముందు టిఫిన్లు తినడానికి సిగ్గుపడ్డారు. మంజు వాళ్ళందరి కళ్ళకీ తెల్లటి బట్టల్లో రాజహంసలా కనిపించ సాగింది.

టిఫిన్ తిని కాఫీలు తాగి చేతులు కడుక్కోనడానికి అందరూ పెరటివైపు వెళ్ళారు.

పెరట్లో తాటాకులతో నేసిన పాకలా వుంది. అక్కడ వంటలు అవుతున్నాయి. చాలామంది మగవాళ్ళు వంటల దగ్గర నిలబడి వున్నారు. అందరిలో ఒక అతను బాగా పొడవుగా వున్నాడు. అతను అటుతిరిగి నిలబడి ఎవరితోనో ఏదో మాట్లాడుతున్నాడు. లాల్చీ పైజమా వేసుకున్నాడు.

మంజు చేయి కడుక్కుంటూ అతని వైపు పరీక్షగా చూసింది. ఎవరా అనుకుంటూ మంజు ఫ్రెండ్సుతో మెట్లు ఎక్కుతోంది లోపలకు వెళ్ళడానికి.

ఎవరో "కృష్ణా" అంటూ పిలిచారు.

మంజు చటుక్కున తలతిప్పి చూసింది.

అతను తల తిప్పి చూశాడు ఆ పిలుపుకి.

అతన్ని చూస్తూనే కొయ్యబారి నిల్చుండిపోయింది ఆమె. రమణి ఆమెను మోచేత్తో పొడిచి "ఆ రౌడీ డ్రైవర్ కూడా వచ్చాడు" అంది రహస్యంగా.

"ఏడవనీ మనకేల" అంటూ నిర్లక్ష్యంగా తల ఎగరేసింది పొగరుగా.

ఆమెను చూస్తూనే అతని కనుబొమ్మలు ఆశ్చర్యంతో పైకి లేచాయి. అతని కళ్ళు వింతకాంతితో తళుక్కున మెరిశాయి.

* * *

మంజు తండ్రి రమణారావుగారు, ఆయన పెద్దకొడుకు జనార్ధనరావు పెళ్ళికి హడావుడిగా తిరగసాగారు. తల్లి జగదాంబ, కోడలు సుందరి అందరూ హడావుడిగానే వున్నారు.

పెళ్ళిపందిరి అంతా రంగురంగుల బల్బులతో, మామిడిఆకుల తోరణాలతో కళకళలాడిపోతోంది. పెళ్ళికొడుకు గోపీనాధ్ పెళ్ళి ముస్తాబులో పెళ్ళి పీటలమీద కూర్చున్నాడు. అతని ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. పౌరోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. పెళ్ళికూతుర్ని తీసుకొచ్చి పీటలమీద కూర్చోబెట్టారు. మాధవి సిగ్గుతో తల పైకిఎత్తలేదు. తల దించుకునే కూర్చుంది.

మంజు నేరేడు రంగు వున్న గద్వాల్ పట్టుచీర, అదే బోర్డర్‌తో వున్న జాకెట్ వేసుకుంది. ఒదులుగా ఒక జడ వేసుకుంది. చెవులకి ముత్యాల జూకాలు, మెడలో ముత్యాలహారం, చేతి నిండా ముత్యాల గాజులు, ఎడంచేతికి రవుండ్‌గా వున్న రిస్ట్‌వాచీ పెట్టుకుంది. నున్నగా తళతళ మెరుస్తున్న చెక్కిళ్ళు, చక్రాల్లాంటి పెద్దపెద్ద కళ్ళు, సన్నగా గీతగీసినట్టు వున్న కనుబొమ్మలు, వంకీల జుత్తు — దివినుండి భువికి దిగి వచ్చిన అప్సరసలా వుంది. పెళ్ళి పందిరి అంతా చకచకా తిరిగేస్తూ, గల గలా మాట్లాడుతూ, కిలకిలా నవ్వుతూ తిరుగుతున్న ఆ అమ్మాయిపైనేవున్నాయి అందరి కళ్ళు.

ఈ అమ్మాయి నా కోడలు అయితే ఎంత బాగుండును అనుకున్నారు అబ్బా యిలుగల తల్లితండ్రులు.

ఈ అమ్మాయి నా భార్య అయితే ఎంత బాగుండును. ఈ అందాలరాశి ఎవరి భార్య కానున్నదో! పెళ్ళికాని యువకుల గుండెల్లో వేడి నిట్టూర్పులు.

ఆ అమ్మాయి ఎవరు? పెళ్ళికూతురి తరుపువాళ్ళు కొందరు గుసగుసలాడారు.

మన మాధవికి ఆడపడుచు అవు తుంది. పెళ్ళికొడుకు చెల్లెలు అని చెప్పు కున్నారు.

మంజు చెవినిపడుతున్నా సరిగ్గా వినిపించుకోలేదు.

దూరంగా డ్రైవర్ కృష్ణ పందిట్లో తిరుగుతున్నాడు. వచ్చినవాళ్ళందర్నీ లోపలకు తీసుకువచ్చి కూర్చోబెడు తున్నాడు. కొందరు అతన్ని పలకరిస్తున్నారు. అతను అందరితో నవ్వుతూ మాట్లాడుతున్నాడు. ఏమకేం కావాలన్నా అతన్నే పలకరిస్తున్నారు.

అతను అంతమందిలో తిరుగు తున్నా, మాట్లాడుతున్నా అతని కళ్ళు మంజూనే గమనిస్తున్నాయి.

మంజు అన్నగారి పక్కన చేరి మెల్లగా ఏమిటో చెప్పింది నవ్వుతూ. గోపీనాథ్ చెల్లెలి మాటలు వింటూనే నవ్వుతూ వధువువైపు ఓరగా చూడ సాగాడు.

మంజు అన్నగారి పక్కనే కూర్చుంది. పెళ్ళి అవుతుంటే ఆమె కళ్ళు డ్రైవర్ని ఒక కంట కనిపెడుతూనే వున్నాయి.

లాల్చీ పైజామాతో వున్నాడు. బట్టలు కొత్త నల్గివున్నాయి. కళ్ళు ఎర్రగా వున్నాయి. నిద్రలేనట్టు క్రాప్ చెదిరి నుదుటిమీద పడుతోంది. అతను మాటమాటకి వేళ్ళతో జుత్తుని వెనక్కి తోసుకుంటున్నాడు. అలా ఇద్దరూ ఒకర్ని ఒకరు గమనించటంలో ఇద్దరి కళ్ళు క్షణంసేపు కల్సుకోకపోలేదు. ఆ కళ్ళు కల్సుకున్న క్షణం అతనికళ్ళు కాంతివంత మవటం, ఆమె చెంపలు ఎర్రగులాబీలు కావటం ఇద్దరూ గ్రహించారు.

గోపీనాథ్ మాధవి మెడలో మూడు ముళ్ళు వేశాడు. పెళ్ళికి వచ్చిన పెద్దలు అంతా వధూవరులపై అక్షింతలు జల్లారు. డ్రైవర్ కృష్ణ కూడా అక్షిం తలు జల్లాడు. ఆ జల్లడం వధూవరు లపై కాక మంజుపై పడ్డాయి. అది గమ నించిన మంజుముఖం కోపంతో ఎఱ్ఱ బడింది.

* * *

ఆ మర్నాడు మధ్యాహ్నం భోజ నాల దగ్గర మంజు ఫ్రెండ్స్, గోపీ నాథ్ ఫ్రెండ్స్ అంతా కలిసి తెగ అల్లరి చేశారు. ఆ కూర కావాలి ఈ కూర కావాలి అంటూ పేచీపెట్టసాగారు. మాధవి అన్నగారు అతని ఫ్రెండ్స్ వాళ్ళకి కావలసినవి వడ్డించసాగారు. మగపెళ్ళివారు కోరింది ఉరుకులు పరు గులమీద తెచ్చి వాళ్ళకు ఇవ్వసాగారు. ఆడపెళ్ళివారు లోలోపల అంతా తెగ విసుక్కున్నారు. ఆ రెండుజడల సీత లేదా ఆ అమ్మాయి చేస్తుంది అంతా అంటూ మగపెళ్ళివార్ని లోలోపలే తిట్టుకుంటూ గొణుక్కున్నారు వాళ్ళు.

మధ్యాహ్నం కాఫీలు తాగి బస్సుకి వెళ్ళిపోతున్నారు మగపెళ్ళివారు. వెళ్ళి పోతూ ఆఖరిసారిగా వాళ్ళని బాగా ఏడిపిం చేద్దాం అనుకున్నారు మగపెళ్ళివారు. వీళ్ళకి మర్యాదగా కాఫీలు, టిఫిన్ అందివ్వసాగారు. లడ్డు, కారప్పూస, కాజా పెట్టారు.

మంజూ, ఆమె ఫ్రెండ్స్, గోపీనాథ్ ఫ్రెండ్స్ అంతా ముఖముఖాలు చూసు కొని ఏక కంఠంతో అన్నారు.

"జిలేబీ లేని పెళ్ళి ఏమిటి! జిలేబీ పట్రండి" అన్నారు.

ఆడపెళ్ళివారి ముఖాలు వెలవెల బోయాయి. ఎలా ఇంతమందికి జిలేబీలు ఇప్పటికి ఇప్పుడు తేవటం అని.

ఆడపిల్లగలవాళ్ళు లోపల అనుకో సాగారు. 'మగపెళ్ళివారు జిలేబీలకి ముఖం వాచివున్నారు తెచ్చిపడేయండిరా అని' మిగతావాళ్ళు మెల్లగా నవ్వుకుంటు న్నారు.

అది విన్న మగపెళ్ళివారి ముఖాలు అవగింజంత అయ్యాయి. రోషంతో ముక్కుపుటాలు ఎగరేశారు.

డ్రైవర్ టాక్సీలో వెళ్ళి పదినిము షాల్లో రెండు బుట్టలతో జిలేబీలు తెచ్చి వాళ్ళకి ప్లేట్లలో ఇచ్చాడు.

అందరూ ముఖముఖాలు చూసుకుని కళ్ళతో సైగచేసుకున్నారు. జిలేబీ నోటితో కొరుకుతూనే థూ అంటూ కింద వూసి చేతిలో జిలేబీలు కింద పారేసి....

"ఛీ ఛీ వెధవ జిలేబీ, నూనెవాసన. ఇలాటి విలువసరుకు తినే కర్మ మన కేమిటీ! పోదాం పదండి" అంటూ అంతా లేచి వెళ్ళిపోయారు. ఆడపెళ్ళివారు నోరు వెళ్ళబెట్టి చూస్తుండిపోయారు.

"అసలు వీళ్ళ ముఖానికి జిలేబీ అంటే తెల్సా? ఎప్పుడైనా తిని ఏడ్చారా" అంటూ వాళ్ళలో వాళ్ళు నవ్వుకున్నారు.

* * *

బస్సులో అంతా కూర్చున్నారు. విడిది ఇల్లు అంతా ఖాళీఅయిపోయింది. బస్సు కాసేపటిలో బయలుదేరబోతుంది అనగా మంజుకి హఠాత్తుగా గుర్తు వచ్చింది తన హ్యాండ్‌బ్యాగ్ మర్చిపోయానని. గబగబ బస్సుదిగి విడిదిలోకి వెళ్ళింది. ఆమె తయారయి బ్యాగ్‌ని అందాకా గోడ అలమారులో వుంచింది. వెళ్ళి ఆలమారా తెరిచిచూస్తే హ్యాండ్ బ్యాగ్ పెట్టింది పెట్టినచోటే వుంది.

ఆ బ్యాగ్ తీసుకుని వచ్చేస్తుంటే గుమ్మంవద్ద అడ్డుగా గుమ్మంపొడవునా నిలబడి వున్నాడు డ్రైవర్.

ఆ విడిదిఇంట్లో ఒక్క పిట్ట లేదు. అంతా ఖాళీఅయిపోయింది.

మంజుకి ఒళ్ళు మండిపోయింది.

"అడ్డులే" నిర్లక్ష్యంగా తల యెగరేసి చేతిలో బ్యాగ్ గిరగిరా తిప్పుతూ అంది. అతను మాట్లాడలేదు. సూటిగా ఆమె కళ్ళలోకి అలాగే చూడసాగాడు. అతని చూపులకి ఏమాత్రం నదురూబెదురూ లేనట్టుగా అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అతన్ని అడ్డులేవమని మళ్ళీ చెప్పింది.

అతను పక్కకు తొలగి ఆమెకు దారిఇచ్చాడు.

ఆమె అతను అలా అడ్డుతొలగి దారి ఇవ్వటంతో హ్యాండ్‌బ్యాగ్ బుజానికి తగిలించుకుని సేవకుడు దారిచూపిస్తుంటే తీవిగా ముందుకి నడిచే మహారాణిలా వెళ్ళబోయింది.

అతని బలిష్టమైన చేయి ఆమె బుజంపైపడి ఆమెను బయటకు వెళ్ళకుండా ఆపింది.

"ఎవరితో అయినా మర్యాద ఇచ్చి పుచ్చుకో" అన్నాడు.

మామూలు సంఘటన!




సినిమాలో యిలా చూస్తాం!!




అనుకోని సంఘటనతో ఆమె తోక తొక్కిన త్రాచులా బుస్సుమంది. ఒళ్ళు తెలియని కోపం కట్టలు తెంచుకుంది. అంతే అతని చెంపమీద బలంగా కొట్టింది.

ఆ దెబ్బతో అతని పట్టు వదిలిపోయింది. దిమ్మరపోయినట్టుగా అయ్యాడు. "జాగ్రత్త నేను ఎవర్ని అనుకుంటున్నావు!" అంది కోపంగా చూస్తూ. "అప్పరాల్ నువ్వొక డ్రైవర్‌వి నాకు మర్యాద గురించి చెప్తావా!" అంటూ విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

మంజు ఎమ్. ఏ. పాసయింది. రమణారావుగారు ఆమెకు సంబంధాలు వెతకసాగారు. ఆమెకు ఎంత కట్నం అయినాసరే ఇచ్చి మంచి సంబంధం తేవాలని ఆయన కోరిక.

సంవత్సరం ఆరుమాసాలు గిర్రున తిరిగిపోయాయి.

మంజుకి ఇంకా పెళ్ళి నిశ్చయం కాలేదు.

మాధవి, గోపీనాథ్ కలిసి వైజాగ్ వెళ్ళవచ్చారు. మాధవి పెత్తల్లి కొడుకు విదేశాల నుంచి వస్తున్నాడని తెలిసి వెళ్ళి చూసివచ్చారు. వచ్చినరోజు మాధవి అత్తగారివద్దకు చేరి విషయం మెల్లగా చెప్పింది. "మా అన్నయ్య న్యూయార్కు నుండి వచ్చాడు. నెలరోజులు వుండి వెళ్ళిపోతాడు మళ్ళీ. మా పెద్దమ్మ, పెదనాన్నగారు అన్నయ్యకి ఏదైనా సంబంధం కుదిర్చి పెళ్ళిచేసి పంపించాలని అనుకుంటున్నారు. అక్కడ మరో రెండు సంవత్సరాలు వుండి తిరిగి ఇండియావచ్చి స్థిరపడిపోతాడని అంటున్నారు. మా అన్నయ్య నా పెళ్ళికి వచ్చాడు. వచ్చి వెళ్ళిపోయాడు. ఆ పెళ్ళిలో మన మంజుని చూశాడట. మంజునితప్ప ఎవర్నీ చేసుకోను అంటున్నాడు. మా పెద్దమ్మ, పెదనాన్నగార్కి అందరికీ ఇష్టమే. మీకు, మావయ్యగార్కి ఇష్టం అయితే అన్నీ మాట్లాడుకుని ముహూర్తం పెట్టుకోవచ్చు" అంది.

జగదాంబ కోడలిమాట వింటూనే సంబరపడిపోయింది.

గోపీనాథ్ తండ్రితో చెప్పసాగాడు.

"మన మంజుని వాళ్ళు కోరి అడుగుతున్నారు నాన్నా. పైసాకట్నం వద్దు అంటున్నారు. మా పెదమావగారు మార్కండేశ్వరరావుగార్కి చాలా ఆస్తి వుంది. వైజాగ్‌లో పెద్దవ్యాపారస్తులుగా మంచిపేరు వుంది. మీరు, అమ్మా 'వూ' అనటమే" అంటూ.

రమణారావుగారు గోపీనాథ్ పెళ్ళిలో అతన్ని చూసివుండటం వలన మేము చూడకుండా ఎలా అన్న ప్రశ్న రాలేదు ఎవరి నోటినుంచీ. అంతా పెళ్ళికి ఒప్పు కున్నారు.

* * *

మంచిరోజు చూసుకుని వైజాగ్ నుంచి మార్కండేశ్వరరావుగారు, ఆయన భార్య, మాధవి తల్లిదండ్రులు వచ్చి సంబంధం ఖాయపర్చుకుని ముహూర్తం నిశ్చయించుకుని వెళ్ళిపోయారు. తెల్సిన అమ్మాయే కావటంచేత డాక్టర్ కృష్ణ ప్రసాద్ పెళ్ళిచూపులకి రాలేదు.

మంజుకి అతను ఎలావుంటాడో చూడలేదు. ఆమె అసలు చూసిన గుర్తు లేదు. అందరూ అతడ్ని ఎంతగానో పొగిడేస్తున్నారు. మన మంజు అదృష్టం, అందగాడు - బుద్ధిమంతుడు-చదువుకున్న వాడు భర్తగా లభిస్తున్నాడు అని.

మంజు కలల అలల్లో తేలిపో సాగింది.

వదినలు ఇద్దరూ హాస్యాలు మొదలు పెట్టసాగారు.

"మా మంజు మా అన్నగారితో న్యూయార్కు వెళ్ళిపోతుంది. అప్పుడు ఎవ్వరం గుర్తువుండం" అంటూ నవ్వుతూ అనసాగారు. సిగ్గు, సంతోషం ముప్పిరిగొనగా అక్కడనుండి లేడిపిల్లలా చెంగుచెంగున గెంతుతూ లోపలకు పరుగెత్తేది,

పెళ్ళి ఇహ వారంరోజులు వుంది. చాలా దగ్గరగా ముహూర్తం నిశ్చయిం చేరు. పెళ్ళిపనులు చకచక అయిపో సాగాయి.

మంజు ఊహాలపల్లకీలో ఊరేగ సాగింది. డాక్టర్ కృష్ణప్రసాద్ ఎలా వుంటాడు అంటూ తన వూహాలకి రూప కల్పనచేస్తూ గడపసాగింది.

* * *

ఆ వేళ రాత్రి పదిన్నరగంటలకు పెళ్ళి అనగా పెళ్ళివారు ఉదయం తొమ్మిది గంటలకి వైజాగ్‌నుండి రెండు బస్సుల్లో దిగారు విడిదింట్లో.

మగపెళ్ళివారు రావటంతో ఆడపెళ్ళి వారు కంగారుపడుతూ అన్నీ అందించ సాగారు. మాధవి అన్నగారు రమేష్, అతని ఫ్రెండ్స్, కృష్ణప్రసాద్ ఫ్రెండ్స్ ఆడపెళ్ళివారిని భోజనాల దగ్గర అది లేదు - ఇదిలేదు అని పేచిపెట్టి వాళ్ళ ప్రాణాలు కొరుక్కుతినేశారు. ఆడపెళ్ళి వారు లోలోపల తెగ విసుక్కోసాగారు. అబ్బ! ఏం వైజాగ్ వాళ్ళురా బాబూ ప్రాణాలు తోడేస్తున్నారు. ఆ బెల్‌బాటమ్ ప్యాంట్‌లు, ఆ చొక్కాలు, ఆ గిరజాల జుట్లు ఎలావున్నారు. ఒక్కొక్కళ్ళు ఎలుగుబంటుల్లా. మనస్సులో తిట్టు కున్నారు వాళ్ళకు అందివ్వలేక.

మధ్యాహ్నం టిఫిన్ దగ్గర మిక్చర్, రవ్వలడ్డూ, బాదుషా పెట్టేరు. 'ఇదేమిటి హల్వా లేదా!' అంటూ అడిగారు వాళ్ళ మీద డాబుచేస్తూ మగపెళ్ళివారు.

ఆడపెళ్ళివారి ముఖాలు వెల్లవేసినట్లు తెల్లబడ్డాయి. ఎలా ఇప్పటికి ఇప్పుడు హల్వాచేయించడం.

"మైదాపిండి హల్వా చేయిస్తారేమో గోధుమపిండి హల్వా కావాలి" అంటూ వాళ్ళలో వాళ్ళు నవ్వుకున్నారు.

ఆడపెళ్ళివారికి చెమటలు పట్టేశాయి. వారి మాటలకు లోపలకు పరుగెత్తారు. వాళ్ళలో వాళ్ళు అనుకోసాగారు.

"వీళ్ళకి వంటల సంగతికూడా తెల్సు రోయ్. కాస్త గోధుమపిండి వాళ్ళ ముఖాన్నపోస్తే ఆ హల్వా ఏదో వాళ్ళే కలబెట్టేసుకుంటారు" అంటూ లోపల నవ్వుకోసాగారు.

"అనవసరంగా మనం వంట బ్రాహ్మ ణులని పిలిపించాం. వీళ్ళే ఒకచెయ్యేసి వంటలన్నీ కానిచ్చేద్దురు." గుసగుస లాడుతూ నవ్వుతున్నారు. అది విన్న మగ పెళ్ళివారు రోషంతో ముక్కుపుటాలు ఎగరేశారు. ఎంత అవమానం! వాళ్ళ ముఖాలు ఎర్రబడ్డాయి.

"ఒరేయ్ నెమ్మదిరోయ్. వాళ్ళు వింటారు. గుడ్లగూబల్లా కళ్ళుఅన్నీ మన మీదే వాళ్ళకి" అన్నారు ఆడపెళ్ళివారు. లోపల నెమ్మదిగా హల్వా హోటల్ నుండి తెప్పించిపెట్టారు అందరికీ.

"ఛ ఛ! ముక్కువాసన. ఇలాంటి హల్వా తినేకర్మ మనకేమిటి పోదాం పదండి" అంటూ లేచిపోయారు టిఫిన్ తినకుండా. మగపెళ్ళివారి అల్లరిచూసి మంజు ముఖం చిన్నబోయింది.

* * *

డాక్టర్ కృష్ణప్రసాద్ పెళ్ళిముస్తా బులో పెళ్ళిపీటలపై కూర్చున్నాడు. తెల్లగా, పొడవుగా, బలంగా, ఆరో గ్యంగా, అందంగా, హుందాగా వున్న అతన్నిచూసి అంతా ఆశ్చర్యపోయారు. మంజు చాలా అదృష్టవంతురాలు అని అంతా ఒప్పుకున్నారు.

కృష్ణప్రసాద్ ఫుల్‌సూట్‌లో మెడలో పూలహారాలతో తలకి గులాబిరంగు తల పాగాతో అందంగా వున్నాడు.

మంజుని తీసుకువచ్చి అతనిపక్కని పీటలపై కూర్చోబెట్టారు. అతనిపక్కని బొమ్మలా అందంగా నాజూగ్గా వున్న మంజుని అంతా ముచ్చటగా చూశారు.

మంజు సిగ్గుతో ముఖంఎత్తి అతన్ని చూడలేకపోతోంది. చూడాలని మనసు ఎంత వేగిరపడుతున్నా కనురెప్పలు సిగ్గుతో బరువుగా క్రిందకు వాలిపో తున్నాయి.

మంజు మెడలో మూడుముళ్ళు పడి పోయాయి.

తలంబ్రాలు పోసేటప్పుడు ఎలాగో కళ్ళెత్తి అతనివైపు చూసింది. అతని కళ్ళు, పెదవులుకూడా నవ్వుతున్నాయి. అతను చాలా హుషారుగా సరదాగా వున్నాడు. అతని పక్కని మాధవి కూర్చుని అన్నగారిచేత తలంబ్రాలు

పోయిస్తోంది.

అంతే! ఆమెకు ప్రపంచం అంతా గిర్రున తిరిగిపోసాగింది. వేలాది పిడుగులు ఒక్కుమ్మడిగా శిరసున వర్షించినట్లయింది. ఆనందం అంతా ఆవిరి అయిపోయింది. తన ఊహాసౌధాలన్నీ వొక్కసారిగా తునాతునకలు అయిపోయాయి.

అతను, అతను డ్రైవర్ అనుకుని చెంపదెబ్బ కొట్టింది, ఎంత పొరపాటు! అతని మనసులో తనపై ఎంత కసి పేరుకొనివుందో. ఆమెకు భయంతో ముచ్చెమటలు పోసేసాయి. తనపై కసితో తనని ఇండియాలో వదిలేసి వెళ్ళిపోడుకదా! తన పొగరు అణచడానికే తన మెడలో మూడుముళ్ళు వేయలేదు కదా! ఇంకా సందేహమా! అతను తన గర్వం అణచడానికే ఇలాచేశాడు. భగవంతుడా నా జీవితం ఇహ ఇంతేనా? జీవితం అంతా కన్నీటితో గడపవలసిందే అన్నమాట.

మంజుకి మనస్సులో దుఃఖం ముంచుకు వచ్చింది.

'భూకంపంలాంటిది ఏదైనా వచ్చి ఈ భూమి బ్రద్దలై తనని భూమాత కడుపులో దాచుకుంటే ఎంత బాగుండును' మనస్సులోనే కుమిలిపోయింది.

పెళ్ళితంతు ఎలాగో ముగిసిపోయింది. ఆమెకు ఒంటిమీద తెలివిలేదు.

* * *

మొదటి రాత్రి.

మంజు దడదడలాడే గుండెలతో తడబడే అడుగులతో కోటిశంకలతో ఆ గదిలో అడుగు పెట్టింది.

ఆమె కళ్ళు నీరుక్రమ్మి అంతా అలికేసినట్టు కనబడుతోంది. ఒంట్లో శక్తినంతాఎవరో లాక్కున్నట్లు నీరసం. కాళ్ళు తేలిపోతున్నాయి. తను ఎదుర్కోబోతున్న పెనుతుఫానులు ఊహించుకుంటూ తలుపుదగ్గరే నిలబడిపోయింది.

అధోవదన అయి కాలి బ్రొటనవేలు నేలనురాస్తూ నిలబడింది. అతనులేచివచ్చి తలుపులు గడియపెట్టాడు. కృష్ణ ప్రసాద్ మెల్లగా ఆమెను సమీపించాడు.

అతను చేరువ అవుతున్నకొద్దీ ఆమె గొంతుక తడిఆరిపోసాగింది. నిస్సత్తువతో శరీరం ఎలాగో అయిపోతుంది. నరాలు తోడేస్తు మాటరావటంలేదు. చలి. పిడుగు పడినట్టుగా శరీరం గడ్డకట్టుకుపోయింది.

"మంజూ" అంటూ మృదువుగా పిలిచాడు.

అతని పిలుపులో అనురాగం స్పష్టమైంది.

అప్యాయమైన ఆ పిలుపు పన్నీటి జల్లులా తేనెపలుకుల్లా వినిపించింది "మంజూ ఏమిటి ఆలోచిస్తున్నావు! ఈ డ్రైవర్‌గాడు నన్ను పెళ్ళిచేసుకున్నాడు వీడ్ని మళ్ళీ ఎలా చెంపదెబ్బ కొట్టాలా అనా!" నవ్వుతూ రెండు చేతులతో ఆమెను చుట్టేస్తూ అన్నాడు.

మంజు మాట్లాడలేదు. కళ్ళనీళ్ళు సుడులు తిరిగాయి.

"నన్ను క్షమించండి. మీరు ఎవరో అనుకున్నాను" అంది కన్నీళ్ళతో.

"ఛ ఛ ఏడుస్తున్నావా! నువ్వు ఇంకా ఎంతో ధైర్యవంతురాలివి అనుకున్నాను. ఛ! అలా ఏడ్వకూడదు" అప్యాయంగా ఆమెకన్నీరుతుడిచిఅక్కునచేర్చుకున్నాడు.

నిలబడే శక్తిలేనట్టుగా అతని వక్షస్థలంమీద వాలిపోయింది. "నన్ను క్షమించండి. నేను చాలా మూర్ఖంగా ప్రవర్తించాను.నాపైనాకేఅసహ్యంవేస్తుంది".

"మంజూ! నిన్ను క్షమించడం ఏమిటి? తప్పు నాదికూడా వుంది. నేను న్యూయార్కు నుండి అమ్మా నాన్నగార్లను చూడడానికి వచ్చాను. అంతలో మా చెల్లెలుపెళ్ళని తెలిసి మరో నాలుగు రోజులు ఆగాను. పెళ్ళికి ముందుగా వెళ్లటం కుదరలేదు. అమ్మా నాన్నా ముందుగావెళ్ళారు. నేను పనివుండి తరువాత బయలుదేరాను. మాకు మూడు టాక్సీలు వున్నాయి. ఇండియా వచ్చిన నాకు నెమ్మదిగా వూర్లుఅన్నీ చూసుకుంటూ వెళ్దాంఅని ట్రైన్‌లో వెళ్ళకుండా టాక్సీతీసుకుని పెళ్ళికి బయలుదేరాను. టాక్సీ నడుపుతున్నాను కాబట్టి టాక్సీడ్రైవర్ని అయిపోయాను. మా ఇంట్లో మా చెల్లెలుపెళ్ళికి ముస్తాబు ఏమిటి అని లాల్చీ పైజామాతో వుండిపోయాను. నేను ఎవరో నీకు తెలియలేదు, నేను ఓ పెద్దరౌడీని అనుకున్నావు అంతేనా!" అంటూ నవ్వి ఆమె చుబుకం పట్టుకుని మృదువుగా తల పైకిఎత్తాడు.

అతని చూపులతో ఆమె చూపులు కలపలేక ఆమె కనురెప్పలు బరువుగా క్రిందకు వాలిపోయాయి,

"అన్నట్టు మర్చిపోయాను. ఆ నాడు నువ్వు నాకు ఇచ్చిన టాక్సీచార్జీ" అంటూ నవ్వుతూ జేబులోనుండి డబ్బుతీసి ఆమెకు ఇవ్వబోయాడు. "నేను న్యూయార్కు వెళ్ళాను అన్నమాటే! నా మనస్సులో అంతా నీ రూపమే నిండిపోయింది. ఎప్పుడెప్పుడు ఇండియా వచ్చి నిన్ను నాదాన్నిగా చేసుకుంటానా అని నా మనసు ఉరకలువేసేది. మనుష్యుల్ని రెచ్చగొట్టే నీ మాటలు, కవ్వించే కళ్ళు మర్చిపోలేక పరుగున వచ్చాను తెల్సా!" తెల్లటి పలువరస అందంగా కనిపించేలా నవ్వుతూ అన్నాడు.

మంజు చెంపలు కెంపులయ్యాయి సిగ్గుతో.

మనసులో పరవళ్ళు తొక్కుతున్న భావాలకి అనుగుణంగా అపూర్వమైన కాంతితో మెరిసిపోతున్న ఆమె వదనాన్ని మనోజ్ఞమైన ఆమె పెదవుల కదలికను అతనికి కనబడనీయకుండా సిగ్గుతో అతని గుండెలో తలదాచుకుని అతనికి మరింత అతుక్కుపోయింది. అతని బలమైన చేతులు ఆమెను మరింత దగ్గరగా తీసుకున్నాయి.

———